క్లుప్తంగా

నాణ్యమైన విత్తనాలు, ఎరువులను విక్రయించాలి


సదాశివనగర్‌లో దుకాణాన్ని పరిశీలిస్తున్న సీఐ సంతోష్‌కుమార్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలను విక్రయించాలని సీఐ సంతోష్‌కుమార్ సూచించారు. శనివారం మండల కేంద్రంలోని సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుకాణానికి వచ్చిన రైతుకు కొనుగోలు చేసిన వస్తువుకు తప్పకుండా రశీదులు ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై రంజిత్, ఏవో ప్రజాపతి, దుకాణ నిర్వాహకులు రమేశ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మిషన్‌భగీరథ పంప్‌హౌజ్ సందర్శన


సమస్యను తెలుసుకుంటున్న అధికారులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండలంలోని మర్కల్ మల్లన్నగుట్ట వద్ద మిషన్‌భగీరథ పంప్ హౌజ్‌ను శనివారం ట్రాన్స్‌కో ఎస్ఈ శ్రావణ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యుత్ సరఫరాపై పొజిషన్ అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. 11 కేవీ గాయత్రి ఫీడర్, 11 కేవీ మర్కల్ ఏజీఎల్‌ద్వారా ద్వారా సరఫరా ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఏడీఈ నరేశ్, ఏఈ గంగాధర్, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులపై దాడులు ఆపాలని ఆర్డీవోకు వినతి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్ : గిరిజనులపై అటవీశాఖ అధికారుల దాడులు ఆపేందుకు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆర్డీవో వీణకు వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా కార్యదర్శి మోతిరాం నాయక్ మాట్లాడుతూ రాజంపేట మండలం శేర్ శంకర్ తండాలో 30 ఏళ్లుగా పోడు భూములు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులపై ఫారెస్ట్ అధికారులు, పోలీసుల పహారాలో దౌర్జన్యం చేశారని తెలిపారు. బాబు,రవి, సత్య, సంఖ్యానాయక్, శంకర్, ఆర్యనాయక్, లక్ష్మణ్ తదితరులున్నారు.

నిరక్షరాస్యులను గుర్తించాలి


హాజరైన అంగన్‌వాడీ టీచర్లు

దోమకొండ: మండలంలో నవ భారత్ సాక్షరత, న్యూ ఇండియా లిటరసీ ప్రోగ్రాంలో భాగంగా మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ మాట్లాడారు. ఐకేపీ గ్రామ సంఘాల మహిళలు, అంగన్‌వాడీ టీచర్లు గ్రామాల్లో నిరక్షరాస్యులను గుర్తించి వారిని ఉల్లాస్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని కోరారు.

తెలంగాణ ఆవిర్భావ ఉత్సవాలకు ఆహ్వానించాలి


వినతిపత్రం అందిస్తున్న ఉద్యమకారులు

బాన్సువాడ రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించే వేడకలకు మలిదశ ఉద్యమకారులను ఆహ్వానించాలని ఉద్యమకారుల ఫోరం కామారెడ్డి జిల్లా కన్వీనర్ ఉడుత గంగాధర్ కోరారు. శనివారం ఆయన తెలంగాణ మలిదశ ఉద్యమకారులతో కలిసి బాన్సువాడ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందించారు. గంజివార్ చందు, బీమానాయక్, రాంచందర్, సాయిబాబ ఎర్రవాటి, కృష్ణ,భాస్కర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల అందజేత

రాజంపేట : మండలంలోని విద్యావనరుల కేంద్రంలో శనివారం మండలంలోని ప్రభుత్వం పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు మండల విద్యాధికారి పూర్ణచందర్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పాఠశాలల ఉపాధ్యాయులు విధిగా ప్రతి విద్యార్థికి పాఠ్య పుస్తకాలను అందించాలని సూచించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్పీలు లింగం,సూర్యపాల్, రమేష్, ఉన్నారు.

చిల్డ్రన్ పార్కులో సౌకర్యాలు కరువు

- ఎల్లారెడ్డిలో విద్యుత్ లైట్లను ఎత్తుకెళ్లిన దొంగలు
- ఏడు గంటలకే మూసి వేస్తున్న వైనం


లైట్లు లేక బోసిగా ఉన్న విద్యుత్ స్తంభాలు


ఎల్లారెడ్డి చిల్డ్రన్ పార్కులో ఆడుకుంటున్న చిన్నారులు

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన చిల్డ్రన్ పార్కులో అసౌకర్యాలు నెలకొన్నాయి. దీంతో ఇబ్బందులు పడుతున్నారు. పార్కులోని విద్యుత్ స్తంభాలకు సంబంధించిన విద్యుత్ లైట్లను దొంగలు ఎత్తికెళ్లడంతో అంధకారంగా మారింది. సాయంత్రం ఏడు కాగానే పార్కుకు తాళాలు వేసి మూసేస్తున్నారు. చిన్నారులు సాయంత్రం సమయంలో ఆటలాడుకునేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.80 లక్షలతో చిల్డ్రన్ పార్కు ఏర్పాటు

పట్టణంలో రూ. 80 లక్షలతో చిల్డ్రన్ పార్కును ఏర్పాటు చేశారు. పార్కు ప్రారంభించి ఏడాదిన్నర సైతం కాక ముందే అధ్వానంగా మారింది. పార్కులో మూత్రశాలలకు తాళాలు వేసి ఉంచడంతో వాటిని వినియోగించడానికి వీలు లేకుండా పోతుంది. చిన్నారులు సాయంత్రం సమయంలోనే పార్కులో ఆడుకునేందుకు వస్తే లైట్లు లేవనే కారణంతో పార్కును మూసి వేయడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి పార్కులో లైట్లు ఏర్పాటు చేసి, టాయిలెట్లను వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లితండ్రులు కోరుతున్నారు.


తాళం వేసి ఉన్న మూత్రశాలలు

ఇబ్బందులు పడుతున్నాం



చిల్డ్రన్ పార్కులో లైట్లు లేక పోవడంతో సాయంత్రం 7 గంటలకు పార్కును మూసి వేస్తు న్నారు. చిన్నారులు సాయంత్రం సమయంలోనే ఆడుకునేందుకు ఇష్టపడుతున్నారు. లైట్లు లేని కారణంగా మూసివేస్తున్నారు. – సురేష్, ఎల్లారెడ్డి

టాయిలెట్లకు తాళాలు వేస్తున్నారు



చిల్డ్రన్ పార్కులో టాయిలెట్లు ఉన్న వాటికి తాళాలు వేసి ఉంచుతున్నారు. దీంతో చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. టాయిలెట్లు వినియోగంలోకి తీసుకువచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – శ్రీనివాస్, ఎల్లారెడ్డి

సమస్యలను పరిష్కరిస్తాం

చిల్డ్రన్ పార్కులో ఉన్న సమస్యలను పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకుంటాం. పార్కులో లైట్లు ఏర్పాటు చేయిస్తాం. టాయిలెట్లను వినియోగంలోకి తీసుకువస్తాం. పట్టణ ప్రజల ఇబ్బందులను తొలగిస్తాం.
– మహేష్‌కుమార్, మున్సిపల్ కమిషనర్, ఎల్లారెడ్డి

అంగన్‌వాడీ బాటను సక్సెస్ చేయాలి

- రెండున్నర ఏళ్లు దాటిన పిల్లలను కేంద్రాల్లో చేర్పించాలి
- ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్య


మాట్లాడుతున్న సీడీపీవో సౌభాగ్య

నిజాంసాగర్(జుక్కల్): ప్రతి గ్రామంలో ఆదివారం నుంచి నిర్వహించే అంగన్‌వాడీ బాటను విజయవంతం చేయాలని బాన్సువాడ ఐసీడీఎస్ సీడీపీవో సౌభాగ్య అన్నారు. రెండున్నర సంవత్సరాలు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. శనివారం మహమ్మద్ నగర్ మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తల సెక్టార్ సమావేశంలో ఆమె మాట్లాడారు. మూడు సంవత్సరాల చిన్నారులు ప్రైవేట్ పాఠశాలల్లో చేరకుండా టీచర్లు చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రాముఖ్యతను తల్లులకు తెలియపర్చాలని చెప్పారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా తల్లులకు, గర్భిణులు, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. సమావేశంలో మహమ్మద్ నగర్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు సంగమణి, శైలజ, స్వప్న, రమ, కమల, సరస్వతి తదితరులున్నారు.

పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం కృషి


బాన్సువాడలో మున్నూరుకాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసిన కాసుల బాల్‌రాజ్

బాన్సువాడ : మున్నూరు కాపు పేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం తన వంతు కృషి చేస్తానని ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ అన్నారు. శనివారం బాన్సువాడ మున్నూరు కాపు సంఘ భవనంలో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 100 మంది మున్నూరు కాపు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్నూరుకాపు విద్యార్థులు ఉన్నత చదువుల కోసం తన వంతు కృషి చేస్తానని, ఉన్నత చదువుల కోసం కళాశాలల్లో చేరే వారికి ఫీజుల్లో రాయితీ కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షులు ఆకుల శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి అంజయ్య, నాయకులు అంజనేయులు, సత్యనారాయణ, కాసుల రోహిత్, తోట కిరణ్, ప్రదీప్, బిట్ల సురేందర్, కొట్టంల గంగాధర్, గుడాల నగేష్ మంద ప్రవీణ్ తదితరులున్నారు.

యువత వ్యసనాలకు దూరంగా ఉండాలి

- బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి
- వలు చోట్ల ప్రపంచ పొగాకు వ్యతిరేక దినం


తాడ్కోల్ జీపీలో మాట్లాడుతున్న జడ్జి భార్గవి

బాన్సువాడ/బిచ్కుంద : మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని బాన్సువాడ సివిల్ కోర్టు జడ్జి భార్గవి అన్నారు. శనివారం మండలంలోని తాడ్కోల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో మండల న్యాయ సేవా అధికార కమిటీ ఆధ్వర్యంలో పొగాకు నివారణ దినోత్సవంను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొగాకు దూరంగా ఉండి కుటుంబానికి ఆసరాగా ఉండాలన్నారు. పొగాకుతో ఆరోగ్యం పాడవడమే కాకుండా కుటుంబానికి దూరమవుతారన్నారు. సిగరేటు తాగడంతో చుట్టు పక్కల ఉండే వారు సైతం అనారోగ్యానికి గురవుతారని, అలాంటప్పుడు ఫిర్యాదు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. అలాంటి వారికి కౌన్సెలింగ్ ఇచ్చేందుకు న్యాయ వ్యవస్థ సిద్ధంగా ఉంటుందన్నారు. అనంతరం మహిళలతో పొగాకు రహిత ప్రతిజ్ఞ చేయించారు.


బిచ్కుందలో మాట్లాడుతున్న జడ్జి వినిత్ కుమార్

ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పొగాకు ఉత్పత్తులను వాడకుండా నిరోధించి, పొగాకు రహిత గ్రామాలుగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బిచ్కుంద జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి వినిత్ కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బిచ్కుంద మున్సిపల్ కార్యాలయం ఆవరణలో న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో పొగాకుపై ప్రజలకు అవగాహన కల్పించారు. జడ్జి వినిత్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రజలు, న్యాయవాదులు, పోలీసులు, స్వచ్ఛంద సంస్థలు, యువకులతో పొగాకు రహిత ప్రతిజ్ఞ చేయించారు. సీఐ నరేష్, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎస్సై మోహన్ రెడ్డి, న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశం, ప్రకాష్, విఠల్‌రావు, విఠల్, శివాజీ, మహ్మద్, భూషణ్‌రెడ్డి, ఖలీల్, కోర్టు సిబ్బంది సుదర్శన్‌గౌడ్, మీడియేషన్ సిబ్బంది ఉన్నారు.

పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన

కామారెడ్డి అర్బన్/ఎల్లారెడ్డిరూరల్/భిక్కనూరు/తాడ్వాయి/సదాశివనగర్ : పొగాకు వ్యసనం జీవితంలో ఎన్నో అనర్థాలకు దారి తీస్తుందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి అన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థలో రాష్ట్ర న్యాయ సేవాధికార జిల్లా సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు నంద రమేష్ అధ్యక్షతన పొగాకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మెడికల్ ఆఫీసర్ శరత్ పొగాకు వినియోగంతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. భిక్కనూరు ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా ఎన్‌సీడీ జిల్లా పోగ్రామ్ అధికారి డాక్టర్ శిరిష పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. తాడ్వాయి మండలంలోని ఎర్రాపహాడ్ గ్రామంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బంది ర్యాలీ తీశారు. మండల వైద్యాధికారి ఖాసీం పొగాకుతో కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. పొగాకు రహిత సమాజంగా మార్చాల్సిన అవసరం ఎంతైన ఉందని మండల మీడియేషన్ సెంటర్ నిర్వాహకులు మఠం విజయ్‌కుమార్ సూచించారు. సదాశివనగర్‌మండల కేంద్రంలో పొగాకు వాడొద్దని అవగాహన కల్పించారు.


మత్తమాలలో..


జిల్లా గ్రంథాలయ సంస్థలో పొగాకు వ్యతిరేక ప్రతిజ్ఞ చేస్తున్న న్యాయవాదులు, సదాశివనగర్‌లో..




భిక్కనూరులో ర్యాలీ తీస్తున్న వైద్య సిబ్బంది


తాడ్వాయి మండలం ఎర్రాపహాడ్‌లో..

ఆధ్యాత్మికం

ఊరదమ్మ ఆలయం నిర్మాణానికి భూమి పూజ



భిక్కనూరు : మండలంలోని తిప్పాపూర్ గ్రామంలో ఊరదమ్మ ఆలయం నిర్మాణానికి శనివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులందరి సహకారంతో ఈఆలయాన్ని నిర్వహిస్తున్నట్టు వీడీసీ అధ్యక్షుడు కొండ సిద్దరాములు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఫోరం మండల మాజీ కన్వీనర్ ద్యావర సాయిరెడ్డి, నేతలు కుంట లింగారెడ్డి వంగేటి చిన్ననర్సరెడ్డి, కోకస్వామి, ధర్మయ్య, రాజు, శ్రీనివాస్, కుంటయ్య నర్సరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరాలయం విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఎల్లారెడ్డిరూరల్ : ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్లపేట గ్రామ శివారులోని చెనింగ రాజరాజేశ్వరాలయంలో విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు మూడు రోజు ల పాటు నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు. మొదటి రోజులో భాగంగా గణపతి హోమం, విగ్రహ ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అన్నదానం చేశారు.

తాండూర్‌లో బోనాల పండుగ



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని తాండూర్‌లో నూతనంగా నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో చేపట్టిన విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం గ్రామ దేవతలకు బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామశివారులో నెలకొల్పబడిన పోచమ్మ, దుర్గమ్మ, కాళమ్మ గ్రామదేవతలకు భక్తిశ్రద్ధలతో బోనాలను సమర్పించారు. ఊరేగింపులో శివసత్తుల విన్యాసాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ముదిరాజ్‌సంఘం సభ్యులు, గ్రామస్తులు తదితరులున్నారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు

భిక్కనూరు: సేవలతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని కామారెడ్డి,నిజామాబాద్ జిల్లాల రవాణాశాఖాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, ఉమమహేశ్వర్ రావులు అన్నారు. శనివారం భిక్కనూరు మండలం జంగంపల్లిలో ఏఎంవీఐ భిక్షపతి పదవీ విరమణ సన్మాన కార్యక్రమంలో వారు ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ తప్పదని ప్రతి ఒక్కరూ ప్రజల అభ్యున్నతికి కృషిచేయాలన్నారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా మోటర్‌వెహికల్ ఇన్స్‌పెక్టర్లు శ్రీనివాస్, నాగలక్ష్మిలు పాల్గొన్నారు.


ఏఎంవీఐ భిక్షపతిని సన్మానిస్తున్న జిల్లా రవాణాశాఖ అధికారులు

పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులకు సన్మానం

కామారెడ్డి క్రైం: జిల్లా పోలీసు శాఖలో పని చేస్తూ శనివారం పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ పొందిన వారిలో డీసీఆర్‌బీ డీఎస్పీ మదన్‌లాల్, ఎస్సై నర్సింలు, ఏఆర్ ఎస్సై పీలం రెడ్డి, దోమకొండ హెడ్ కానిస్టేబుల్ చంద్ర ప్రకాష్‌లు ఉన్నారు. వారిని ఏఆర్ డీఎస్పీ యాకూబ్ రెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసు శాఖలో 35–40 ఏళ్ల పాటు క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలు అందించి రిటైర్ అవుతున్న అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. సీఐలు జార్జ్, తిరుపతయ్య, శ్రీధర్, శ్రీనివాసులు, ఆర్ఐలు నవీన్ కుమార్, కృష్ణ, సంతోష్ కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఏటీవో సురేష్ సేవలు మరవలేనివి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ట్రెజరీ కార్యాలయంలో ఏటీవోగా విధులను నిర్వర్తించిన సురేష్ సేవలు మరవలేనివని నిజామాబాద్ జిల్లా ట్రెజరీ శాఖ డిప్యూటీ డైరెక్టర్ దశరథ్ అన్నారు. ఎల్లారెడ్డిలో నిర్వహించిన ఏటీవో సురేష్ పదవీ విరమణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సురేష్ దంపతులను గజమాల, శాలువా, మెమెంటోతో సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దేవేందర్, కార్యదర్శి సాయిరెడ్డి, అన్ని ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులున్నారు.

గుండె ఆపరేషన్ కోసం ఏ పాజిటివ్ రక్తదానం

కామారెడ్డి అర్బన్: మూడు రోజులుగా ఏ పాజిటివ్ రక్తం కోసం ప్రయత్నించగా రామారెడ్డి మండలం సింగరాయపల్లికి చెందిన అనిల్ రక్తదానం చేశారని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా సమన్వయకర్త బాలు తెలిపారు. కామారెడ్డికి చెందిన 56 ఏళ్ల సువర్ణ అనే మహిళకు గుండె ఆపరేషన్ కోసం ఏ పాజిటివ్ రక్తం అవసరమైంది. సువర్ణ బంధువులు బాలును సంప్రదించి కామారెడ్డి రక్తదాతల సమూహం ద్వారా ప్రయత్నం చేయడంతో సింగరాయపల్లికి చెందిన అనిల్ ముందుకు వచ్చి శనివారం హైదరాబాద్‌కు వెళ్లి రక్తదానం చేశారు.

సంక్షిప్తం

ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం బాధ్యతలను స్వీకరించారు. ఎల్లారెడ్డి ఆర్డీవోగా విధులను నిర్వర్తించిన మన్నె ప్రభాకర్ పదవి విరమణ పొందడంతో బాన్సువాడ్ సబ్ కలెక్టర్ కిరణ్మయి ఎల్లారెడ్డి ఇన్‌చార్జి ఆర్డీవోగా చార్జి తీసుకున్నారు.

దోమకొండ తహసీల్దార్‌గా సుధాకర్



దోమకొండ: దోమకొండ తహసీల్దార్‌గా శనివారం సుధాకర్ పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సంజయ్‌రావు పదవీ విరమణ చేయగా, ఆయన స్థానంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న సుధాకర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు. పదవీ విరమణ పొందిన తహసీల్దార్ సంజయ్‌రావును కార్యాలయ సిబ్బంది సన్మానించారు. తహసీల్దార్ సుధాకర్ గతంలో నిర్మల్ జిల్లాలో విధులు నిర్వహించి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

తెలంగాణ చరిత్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా జయప్రకాష్ నియామకం



కామారెడ్డి టౌన్: తెలంగాణ చరిత్ర పరిశోధనలో ముఖ్య భూమిక పోషిస్తున్న తెలంగాణ చరిత్ర కాంగ్రెస్‌కు ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర అధ్యాపకుడు అంకం జయప్రకాష్ నియమితులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ తెలిపారు. ఆయన నియామకంపై కళాశాల అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

వరంగల్ తరలిన ఎమ్మార్పీఎస్ నాయకులు

మాచారెడ్డి: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగకు నిర్వహించనున్న స్వాగత ర్యాలీకి శనివారం ఎమ్మార్పీఎస్ నాయకులు వరంగల్ తరలి వెళ్లారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా పద్మశ్రీ అవార్డు అందుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయనకు స్వాగతం పలికేందుకు నాయకులు తరలి వెళ్లారు.

అంబేడ్కర్ సంఘం భిక్కనూరు అధ్యక్షుడిగా భానుప్రకాశ్



భిక్కనూరు: అంబేడ్కర్ సంఘం భిక్కనూరు అధ్యక్షుడిగా దుబాషి భానుప్రకాశ్ శనివారం ఏకగ్రీవంగా ఎన్నికైయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కొత్తొల్ల గంగారం ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అంబేడ్కర్ సంఘం అధ్యక్షుడి భానుప్రకాశ్‌తో పాటు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన గోసు రమేష్, భూపాల్, మహేష్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దుబాషి నరేందర్, భారతీయ విద్యార్థి మోర్చ రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్, మండల అంబేడ్కర్ అధ్యక్షుడు దుబాషి స్వామిలు పాల్గొన్నారు.